


## నిర్మాణాల విషయంలో అలసత్వం వద్దు



**కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :** జగనన్న కాలనీలో గృహ నిర్మాణాల విషయంలో అలసత్వం లేకుండా లేఅవుట్ అధికారులు లబ్దిదారుల్లో మరింత అవగాహన పెంచి సకాలంలో పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఎం. ధనలక్ష్మి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని లబ్దిదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ప్రారంభం కాని గృహ లబ్దిదారులను గుర్తించి వారంలోపు అవి ప్రారంభించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13,14,5 తేదీల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అదే సమయంలో పారిశుధ్యంపై కూడా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజల్లో అవగాహన పెంచేలా చూడాలన్నారు. స్పందనలో వచ్చే అర్జీల పరిష్కారంపై అలసత్వం లేకుండా సకాలంలో వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ నిర్ణీత వేళలు పాటించడమే కాకుండా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఈవోపీఆర్డీ కల్పన, గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ వెంకటేశ్వర్లురెడ్డి, వివిధ శాఖల ఏఈలు , తదితరులు ఉన్నారు.

## నెల్లూరు ఆర్‌డిఓ కార్యాలయ డిఏఓగా హేమాద్రిరాజు

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** నెల్లూరు ఆర్‌డిఓ కార్యాలయ పరిపాలనాధికారిగా హేమాద్రిరాజు నియమితులయ్యారు. కలెక్టరేట్‌లో సీ-సెక్షన్ సూపరెండెంట్‌గా పనిచేస్తున్న హేమాద్రిరాజును నెల్లూరు ఆర్‌డిఓ కార్యాలయ పరిపాలనాధికారిగా బదిలీచేసిన కలెక్టర్ అక్కడ పనిచేస్తున్న రాఘవేంద్రరావును కలెక్టరేట్‌లోని సీ-సెక్షన్ సూపరెండెంట్‌గా నియమించారు.

## 25 మంది వ్యవసాయ సహాయకుల సస్పెండ్


**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళకు సంబంధించి జరిగిన అక్రమాల్లో భాగంగా ఈ-క్రాప్ నమోదులో అవకతవకలకు పాల్పడ్డ 25 మంది గ్రామ వ్యవసాయ సహాయకుల (విఏఏ)పై వేటుపడింది. జిల్లాలో మొదటిసారిగా ఒక్కశాఖకు చెందిన 25 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఇదే మొదటిసారి కాగా ఈ విషయం వ్యవసాయశాఖలో కలకలం సృష్టిస్తోంది. వివరాల్లోకి వెలితే జిల్లాలో జరుగుతున్న ధాన్యం కొనుగోళ్ళు ఈ-క్రాప్ నమోదు ప్రకారం జరుగుతున్న విషయం విదితమే. గత ఏడాది అక్టోబర్ నుండి ఈ ఏడాది జూలై వరకు జరిగిన రెండు సీజన్లకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్ళు జరగ్గా ఈ ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో జరిపిన విచారణలో ఈ-క్రాప్ నమోదు నుండే ఈ అక్రమాలకు బీజం పడిందని స్పష్టమైంది. భూమి లేకపోయినా వున్నట్లు అక్కడ ధాన్యం పండించినట్లు ఈ-క్రాప్‌లో నమోదు చేయడం...చెరువులు, రోడ్లను కూడా పొలాలుగా చూపుతూ అక్కడా ధాన్యం పండించినట్లు ఈ-క్రాప్‌లో నమోదు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఈ-క్రాప్ నమోదు చేసిన భూముల్లోని పంటను మాత్రమే కొనుగోలు చేసేలా ప్రభుత్వం నిబంధన తీసుకురావడం, ఆ విధంగా వచ్చిన దిగుబడులనే రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ఆదేశించడంతో ఈ-క్రాప్ నమోదు తప్పనిసరైంది. దీన్ని అవకాశంగా తీసుకొని దళారులు-మిల్లర్లు రైతులకు దక్కాల్సిన కనీస మద్దతు ధరను కొంతమంది విఏఏల సహకారంతో గద్దల్లా తన్నుకుపోయారు. ధాన్యం కొనుగోళ్లలో భారీగా అక్రమాలు జరిగాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో విచారణకు ఆదేశించడం జరిగింది. మొదటివిడతలో రూ. 3 లక్షల రూపాయలలోపు విక్రయాలు జరిగిన ఎఫ్‌టీఓ (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)లపై జిల్లావ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. రెండు వ్యవసాయ సీజన్లకు సంబంధించి ఇటువంటి లావాదేవీలు 4484 జరగ్గా జాయింట్ కలెక్టర్, ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, విఆర్వోలు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అందులో 3914 ఎఫ్‌టీఓలు సక్రమంగా వున్నట్లు మిగిలినవి సక్రమంగా లేనట్లు గుర్తించారు. సక్రమంగా లేని 525 ఎఫ్‌టీఓలపై రెవెన్యూ అధికారులు మరింత లోతుగా విచారణ జరిపి మొత్తం రూ. 34.24 కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని రైతులు కాకుండా ఇతరులు విక్రయించారని గుర్తించారు. మరో 234 ఎఫ్‌టీఓలకు సంబంధించి రూ. 14.60 కోట్ల విలువైన ధాన్యం కొనుగోళ్లపై పలు రిమార్కులను గుర్తించారు. వీటికి సంబంధించి రైతులకు సంబంధం లేకుండా వారి పేర్లతో వేరొకరు ధాన్యం విక్రయించినట్లు అధికారులు తమ విచారణలో తేల్చారు. మొత్తం మీద ఈ-క్రాప్ నమోదులో చోటుచేసుకున్న ఈ అవకతవకలకు బాధ్యులుగా 63 మంది గ్రామ వ్యవసాయ సహాయకులను గుర్తించిన అధికారులు ఈ మేరకు నివేదికను జిల్లా కలెక్టర్-జాయింట్ కలెక్టర్లకు అందజేశారు. అనుమానాస్పద ఎఫ్‌టీఓలు మినహాయించి పక్కాగా తప్పు చేసినట్లు తేలిన ఎఫ్‌టీలకు సంబంధించి ఈ-క్రాప్ నమోదుచేసిన 25 మంది విఏఏలపై చర్య తీసుకోవడం గమనార్హం. మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు జారీచేస్తున్న జిల్లా యంత్రాంగం వారి నుండి వివరణ వచ్చిన తర్వాత వారిపై కూడా చర్యలు తీసుకొనే పరిస్థితి కనడుతోంది. కాగా మొదటివిడతలో రూ. 3 లక్షలలోపు ఎఫ్‌టీఓలపై విచారణ జరిపిన జిల్లా యంత్రాంగం రెండవవిడతలో రూ. 3 లక్షలపై బడ్డ ఎఫ్‌టీఓలపై విచారణ జరపాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ పూర్తయితే ఎంతమంది విఏఏలపై వేటు పడుతుందో వేచిచూడాల్సిందే...

## సంగం బ్యారేజి పనులలో అపశృతి -ఒకరు మృతి



**సంగం ఆగష్టు 8 ప్రభాతవార్త** సంగం బ్యారేజి పనులలో అపశృతి చోటు చేసుకుంది. బ్యారేజి వద్ద గేటు ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు 13 టన్నుల గేటుపైన బడి బీహార్‌కి చెందిన జయలాల్ అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ మలోల



**నెల్లూరురూరల్, ఆగష్టు8 ప్రభాతవార్త** నెల్లూరు రెవెన్యూ సబ్‌డివిజనల్ నూతన అధికారిగా మలోల నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వ సంక్షేమం అందరికీ అందించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆర్డీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాయిరాం సిల్వర్ ప్యాలెస్‌లో ఇన్‌కమ్ టాక్స్ దాడులు

### చెన్నైలో కావలి వ్యాపారిది 50 లక్షలు నగదు పట్టివేత

**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** కావలి పట్టణ విష్ణాలయం వీధిలోని సాయిరాం సిల్వర్ ప్యాలెస్‌పై ఇన్‌కమ్ టాక్స్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ షాపు యజమాని నల్లూరు మనోజ్‌కు చెందిన 50 లక్షల రూపాయల నగదు చెన్నైలో రైల్వే పోలీసులు పట్టుకున్నారు. నగదు తీసుకెళ్తున్న వ్యక్తి సమాచారం మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టుకున్న నగదును ఇన్‌కమ్ టాక్స్ శాఖకు అప్పజెప్పడంతో ఇన్‌కమ్ టాక్స్ అధికారులు కావలిలో అడుగుపెట్టారు. సాయిరాం సిల్వర్ ప్యాలెస్‌లో తనిఖీలు నిర్వహించారు. గుంటూరు నుంచి నలుగురు ఇన్‌కమ్ టాక్స్ అధికారుల బృందం ఈ షాపులో అడుగు పెట్టి సోదాలు నిర్వహిస్తుంది. పట్టుబడ్డ 50 లక్షలు నగదుకు సంబంధించి ఈ అధికారులు వివరాలు సేకరించడంలో నిమగ్నమయ్యారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి దాకా ఈ అధికారులు విచారణ సాగిస్తున్నారు. కావలి పట్టణం నుంచి బంగారు బిస్కెట్లు కొనుగోలు చేసేందుకు ఇక్కడి వ్యాపారస్తులు లక్షల్లో నగదు తీసుకెళ్లడం ఆనవాయితి. పట్టుబడితే దాడులు, లేకుంటే యథేచ్ఛగా బంగారు బిస్కెట్ల వ్యాపారం. కావలిలో ఇన్‌కమ్ టాక్స్ అధికారుల బృందం అడుగుపెట్టిందన్న వార్త దావాలనంలా వ్యాపించడంతో ఆ శాఖ పరిధిలోని వ్యాపారస్తులు అప్రమత్తమయ్యారు.

## నిధులు దిగమింగిన ఏపీఎం నుండి రికవరీ

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** జిల్లాలోని కొండాపురం మండలంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందాల్సిన రుణాలను దిగమింగి సస్పెండ్‌కు గురైన ఏపీఎం నుండి ఆ నిదులను రికవరీ చేయాలని కోరుతూ జిల్లా విజిలెన్స్-మానిటరింగ్ కమిటీ సభ్యులు కొప్పాల రఘు సోమవారం డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరక్టర్ కేవీసాంబశివారెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్వయం సహాయక సంఘాలలోని షెడ్యూల్‌కులాలు-షెడ్యూల్‌తెగల సభ్యులకు రావాల్సిన స్త్రీనిధి-పసుపుకుంకుమ తదితర రుణాలకు సంబంధించి రూ. 27.14 లక్షల నిదులను దిగమింగిన ఏపీఎం నుండి ఆ నిధులు రికవరీ చేయాలన్నారు. అదేవిధంగా సోమశిలకు సంబంధించి కొన్ని ఎస్సీ పొదుపు సంఘాల సభ్యులకు పెండింగ్‌లో వున్న ఆసరా రుణాలను మంజూరు చేయాలని ఆ వినతిపత్రంలో పీడీని కోరారు.

# ప్రతిష్టాత్మకంగా రొట్టెల పండుగ





**నెల్లూరుటౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త** నెల్లూరుజిల్లాకు తలమానికంగా నిలిచే రొట్టెల పండుగ నిర్వహణకు ఏర్పాట్లన్నీ ఘనంగా పూర్తి చేశామని, పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని వసతులతో సేవలించించనున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బారా షహీద్‌దర్గా ప్రాంగణంలో జరుగుతున్న పండుగ ఏర్పాట్లను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి సోమవారం పర్యవేక్షించారు. ఈసంథర్భంగా నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రేపటి నుంచి ప్రారంభమవుతున్న పండుగకు ముందుగానే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా కరోనా కారణంగా ఆగిపోయిన పండుగను ఈఏడాది అందరి సమన్వయంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిచనున్నామని మంత్రి చెప్పారు. జిల్లా కలెక్టర్ చక్రథర్‌బాబు సారధ్యంలో ఎస్పీ, జాయింట్ కలెక్టర్, మేయర్, కమిషనర్‌లతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో అత్యంత ప్రణాళికా బద్దంగా పండుగ ఏర్పాట్లను పూర్తి చేసి వసతులను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారని కొనియాడారు. రానున్న రోజుల్లో భక్తుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో రొట్టెలు మార్చుకునే స్వర్ణాల చెరువు ప్రాంతం మొక్కలు తీర్చుకునే దర్గాలోని ప్రాంగణాలలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి బారా షహీదుల దర్శనం సాఫీగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి రొట్టెల పండుగ నిర్వహణ అంశం తీసుకొచ్చామని, మతసామరస్యానికి ప్రతీకగా నిలచే పండుగలలో అన్ని ఏర్పాట్లను ఘనంగా చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి తెలిపారు. రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీథర్‌రెడ్డి, మేయర్ పొట్లూరి స్రవంతి, జిల్లా కలెక్టర్ చక్రథర్‌బాబు, ఎస్పీ విజయరావు, జాయింట్ కలెక్టర్ కూర్మానాధ్, కమిషనర్ డి.హరిత, ఆర్డీఓ మలోలా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి కనకదుర్గా భవాని, స్థానిక కార్పొరేటర్ యాకసిరి వాసంతి, దర్గా కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రొట్టెల పండుగ



**నెల్లూరుటౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త** నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలస్తోందని పెద్ద సంఖ్యలో భక్తులు బారాషాహీద్ దర్గా వచ్చి ప్రార్థనలు చేసి స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకోవడం ఇందుకు నిదర్శనమని మాజీ మంత్రి, నెల్లూరుసిటీ ఎమ్మెల్యే పోలుబోయిన అనీల్‌కుమార్ అన్నారు. రొట్టెల పండుగను పురస్కరించుకుని బారా షహీద్ దర్గాను సోమవారం అనీల్‌కుమార్ యాదవ్ సందర్శించారు. నగరపాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి, కమిషనర్ హరిత, వైసీపి రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా గిరిధర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్‌లతో దర్గా వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే అనీల్‌కు ఘనస్వాగతం పలికారు. దర్గాలోని బారా షహీదుల సమాధులను దర్శించి ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం నగర పాలక నగరపాలక సంస్థ ఆద్వర్యంలో దర్గాలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. కరోనా ఉదృతి వలన గత రెండేళ్లుగా పండుగ నిర్వహించలేకపోయామని, ఈసారి పండుగకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. రానున్న భక్తులను దష్టిలో ఉంచుకుని రూరల్ ఎమ్మెల్యే శ్రీథర్‌రెడ్డి సారధ్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. పారిశుధ్యం, పార్కింగ్, మహిళలకు రక్షణ, బారికేడ్ల నిర్మాణం, పోలీసుల పర్యవేక్షణ, స్వర్ణాల చెరువు తీరం వెంబడి భద్రతా చర్యలు వంటి వివిధ అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. భక్తులంతా క్రమశిక్షణగా రొట్టెలు మార్చుకునేలా దర్గాలో మొక్కులు చెల్లించుకునేలా పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వివిధ డిబిజన్ల ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ విభాగాల అధికారులు, కార్పొరేషన్ అధికారులు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి కనకదుర్గా భవాని, జిల్లా వక్‌బోర్డ్ ఇన్స్పెక్టర్ షేక్.అహ్మమద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి రొట్టెల పండుగ

### -భారీగా తరలివస్తున్న భక్తజనం



**నెల్లూరుటౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త** నెల్లూరు రొట్టెల పండుగ రానే వచ్చింది....పండుగకు సర్వం సిద్ధం కాగా...భక్త జనం పిల్లాపాపలతో సొంత ఊర్ల నుంచి స్వర్ణాల చెరువుకు చేరుకుని రొట్టెలను మారుృకునేందుకు ముందే తరలి వస్తున్నారు. సర్వమత సామరస్యతకు ప్రతీక నిలిచి రాష్ట్ర పండుగగా పేరు ప్రఖ్యాతలు గాంచిన నెల్లూరు బారా షాహీద్ దర్గా స్వర్ణాల చెరువు రొట్టెల పండుగ ఈనెల 9వ తేది మంగళవారం నుంచి అత్యంత వైభవంగా ప్రారంభం కానున్నది. అయితే రొట్టెల పండుగకు ఒక రోజు ముందుగానే సోమవారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి విశేషంగా అత్యధిక సంఖ్యలో భక్తులు రావడంతో బారా షాహీద్ ప్రాంగణంతో పాటు స్వర్ణాల చెరువు కూడా భక్తులతో **మిగతా 2లో..**

# కలెక్టరేట్ వద్ద అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** అగ్రిగోల్డ్‌కు సంబందించి రూ. 20 వేలలోపు మిగిలివున్న 3.50 లక్షలమంది బాధితులకు...రూ. 20 వేల రూపాయలపైన డిపాజిట్‌చేసిన 6.50 లక్షలమంది బాధితులకు డిపాజిట్లు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ అగ్రిగోల్డ్ కస్టమర్స్-ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ బాధితులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిలబెట్టుకోవాలని..అగ్రిగోల్డ్ బాధితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలన్నారు. గత ఆగస్టులో రూ. 20 వేల రూపాయలలోపు బాధితులకు రూ. 667 కోట్లను బటన్ నొక్కి సీఎం జమ చేయగా అందులో కొన్ని వేలమందికి నేటికీ నగదు జమ కాలేదన్నారు. వారితోపాటు అంతకన్నా ఎక్కువ నగదు డిపాజిట్ చేసిన వారికీ నగదు చెల్లించాలన్న వారు ఇందుకు సంబందించి అగ్రిగోల్డ్ వారి ఆస్తులన్నీ ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలన్నారు. అలాగే పలు స్కీమ్‌ల పేర్లతో అగ్రిగోల్డ్ కంపెనీ విక్రయించిన ఇంటిస్థలాలు, కౌలుభూముల స్కీమ్‌లో కొన్నవారికి, ఎకో చందనవనం స్కీమ్‌లో స్థలాలను కొన్నవారికి ఆ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. ఈ మేరకు నినాదాలు చేసిన అగ్రిగోల్డ్ బాధితులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందనలో అధికారులకు అందజేశారు.

# ప్రతి బుధవారం మండలాల్లో తనిఖీలు





**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** మండల ప్రత్యేకాధికారులుగా నియమితులయిన జిల్లా, డివిజన్‌స్థాయి అధికారులు విధిగా ప్రతి బుధవారం తమకు కేటాయించిన మండలాల్లో పర్యటించాలని..నిర్దేశించిన అంశాలకు సంబంధించి తనిఖీలు జరపాలని జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో స్పందన కార్యక్రమం నిర్వహించిన ఆయన హాజరయిన జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారులు ప్రతి బుధవారం కేటాయించిన మండలాల్లో పర్యటించాలన్న ఆయన పేదలందరికీ ఇళ్లు, మధ్యాహ్న బోజనపథకం తదితరాలను తనిఖీ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలైన వివిధ భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్న చక్రధర్‌బాబు నిర్మాణం మొదలైనవి త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతోపాటు ఇంతవరకు నిర్మాణం మొదలుపెట్టని భవనాల నిర్మాణం మొదలయ్యేలా స్పెషలాఫీసర్లు చూడాలన్నారు. ఇక కోర్టు కేసులపై ఆయాశాఖల అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని, శాఖలవారీగా కోర్టు కేసులపై సమీక్ష జరిపారు. కోర్టు కేసులు ధిక్కారణ వరకు వెల్లకుండా చూడాలని, కోర్టుల నుండి ఏమైనా ఉత్తర్వులు వస్తే తక్షణమే అమలుచేయాలన్నారు. స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలే తిరిగి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్వో వెంకటనారాయణమ్మ, టీజీపీ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి, జిల్లాపరిషత్ సీఈఓ వాణి, డిపిఓ ధనలక్ష్మి, మెప్మా పీడీ తిరుపతయ్య, డిఆర్‌డిఏ పీడీ కేవీసాంబశివారెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, సర్వే-ల్యాండ్‌రికార్డ్సు ఏడి హనుమాన్‌ప్రసాద్, డీటీసీ చందర్, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడి నాగరాజకుమారి, సమగ్రశిక్ష ఏపీడీ ఉషారాణి, డీసీఓ తిరుపాల్‌రెడ్డి, సెట్నెల్ సీఈఓ పులన్లయ్య, జలవనరులశాఖ ఎస్ఈ కృష్ణమోహన్, బీసీ కార్పోరేషన్ ఈడీ బ్రహ్మోనందరెడ్డి, డిఎస్‌డబ్ల్యుఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలు



ఉలవపాడు, ఆగస్టు8, ప్రభాతవార్త: సదుపాయాలు ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి జగనన్న ముందంజలో ఉన్నారని కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉలవపాడు 2వ సచివాలయం పరిధిలోని రిజ్వర్‌కాలనీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అప్పటికప్పుడే అధికారులకు చెప్పి పరిష్కరించాలని ఆయన కోరారు. అలాగే జగనన్న ప్రభుత్వంలో సంక్షేమపథకాల గురించి ముఖ్యంగా నవరత్నాల గురించి ఎవరి ద్వారా మీకు పథకాలు అందుతున్నాయో తెలుసుకోవాలని కోరారు. 1వ తేదీనే పెన్షన్లు అందిస్తున్నట్లు చెప్పారు. మీ దగ్గర ఎవరైనా వాలంటీర్లు డబ్బులు అడుగుతున్నారా అని ఆ ప్రాంత వాసులను అడిగి ఆరా తీశారు. పరిసర ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేని ఆ ప్రాంత వాసులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన విరామం లేకుండా ఆయన 500లకు పైగా గడప గడపకు వెళ్లి మాట్లాడారు.

## వైసీపి పాలనలో మహిళలకు భద్రత కరువు



కందుకూరు, ఆగస్టు8, ప్రభాతవార్త: వైసీపి ప్రభుత్వ పాలనలో మహిళలకు భద్రత కరువైందని ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని నాయిబ్రాహ్మణ బజారు, సీపిఎం ఆఫీస్, కాళిదాసు వారి వీధి తదితర ప్రాంతాలలో ఆయన బాదుడే బాదుడు కార్యక్రమానికి ఆయన హాజరైయ్యారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాంతో కలిసి కరపత్రాలు ఇచ్చి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి నాగేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న పాలన ప్రజలను అదోగతి పాలు చేసిందని పేర్కొన్నారు. మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఎద్దావా చేశారు. వైసీపి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. సభ్య సమాజానికే తలవంపులు తెస్తున్నారని పేర్కొన్నారు. ఎంపి మాధవ్, మంత్రులు అంబటి, మాజీ మంత్రి అవంతి, కొడాలి నాని తదితరులు అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు చెప్పారు. ఇటువంటి వారిని ప్రజలు వెలివేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా దివి శివరాం మాట్లాడుతూ గత మూడేళ్ల పాలనలో నియోజకవర్గంలో అభివృద్ధే జరగడంలేదని ఆరోపించారు. వైసీపీ నేతలు ఇతర పార్టీల వారిపై అక్రమ కేసులు పెట్టి బెదిరింపులకు దిగుతున్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం నేతలపై ఎన్నో అక్రమ కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాద్, గోచిపాతల మోషే, ఎస్‌కె రఫీ, సలాం, మున్నా, మహిళా నాయకురాలు శైలజ, ఆదెమ్మ, రాజ్య లక్ష్మి, ఉమా తదితరులు పాల్గొన్నారు. టిడిపి నేతలను పరామర్శించిన ఇంటూరి కందుకూరు పట్టణానికి చెందిన ముస్లిం టిడిపి నాయకుడు సయద్ నజీర్ అనారోగ్యం పాలవడంతో తెలుసుకున్న ఇంటూరి నాగేశ్వరరావు, దివి శివరాంలు ఆయన వద్దకు వెళ్లి పరామర్శించారు. ఆ ప్రాంతానికి చెందిన గౌస్ భాషా, రూబీ, షేక్. మహాబాషా, ఖాదర్‌వలీ, జలీల్, జాకీర్ తదితరులు ఉన్నారు.

## బాలుర ఉన్నతపాఠశాలలో ఆజాదిక అమృతమహోత్సవ్ ఉత్సవాలు

**వింజమూరు, ఆగస్ట్8, ప్రభాతవార్త:** వింజమూరు బాలుర ఉన్నతపాఠశాలలో ఆజాదిక అమృతమహోత్సవ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సోమవారం బాలుర ఉన్నతపాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులతో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు గావించారు. వారిచే వివిధ దేశభక్తి గీతాలు , వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. విద్యార్థిని, విద్యార్థులు ఆజాదిక అమృత్‌మహోత్సవ్‌లో పాల్గొని స్వతంత్ర పోరాట సాధనలో అశువులు బాసిన నాయకులను స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సి. హెచ్. మాలకొండయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలి



**కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :** విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మహనీయులు ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని గ్రంథ బాండాగారి జె. సురేంద్రరెడ్డి తెలిపారు. కోవూరులోని శాఖా గ్రంథాలయంలో సోమవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యాలయంలో భాగంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని కె. రజిత మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను ప్రతి విద్యార్థి పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి 11 అర్జీలు



**కందుకూరు టౌన్, ఆగస్టు8, ప్రభాతవార్త:** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమీషనర్ మనోహర్ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో సమస్యల పరిష్కారం కొరకు 9అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. అలాగే డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమం ద్వారా 2అర్జీలు వచ్చాయని మొత్తం 11అర్జీలు వచ్చినట్లు కమీషనర్ తెలిపారు. స్పందన కార్యక్రమంలో అన్ని సెక్షన్ల హెడ్స్ పాల్గొన్నారు. ప్రతి సోమవారం కందుకూరు పురపాలక సంఘంలోని కమీషనర్ చాంబర్ నందు జరుగు స్పందన, డయల్ యువర్ కమీషనర్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమీషనర్ కోరారు. పురపాలక సంఘం పారిశుద్య సమస్యల పరిష్కారం కొరకు 9177700367ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నియామకం

**నెల్లూరు ఆగస్టు 8, ప్రభాతవార్త-వైద్యం :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్, పీహెచ్‌సీ, యుపీహెచ్‌సీలలో కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలందించేందుకు స్పెషలిస్టు వైద్యుల నియామకం చేపడుతున్నట్లు డీఎంహెచ్‌ఓ ఎం. పెంచలయ్య సోమవారం ఒ ప్రకటనలో తెలిపారు. గైకాలజీ-4, జెరియాట్రిక్-8, ఇఎన్‌టీ-7, పెరియాట్రిక్-6, డెర్మటాలజీ-5, ఆర్థోపెడిక్-6, చెస్ట్-6, పల్మనాలజీ-6, ఎన్‌సీడి-8, జనరల్ సర్జరీ-2, వైద్యుల నియామకాలు చేపడుతున్నామని, వీరి వేతనం నెలకి రూ.1.10వేలు, వెహికల్ ఖర్చులు అందచేయడం జరగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత సర్టిఫికేట్లతో ఈనెల 10 నుంచి 17వరకు సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నేరుగా ఇంటర్వ్యూలకు(వాక్ ఇన్ ఇంటర్వ్యూలు) ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటలలోపు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

## గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చర్యలు

**సైదాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:** మండలంలోని గ్రామాల్లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దారు పి. కృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ సమస్యలపై ప్రజల వద్ద నుంచి సుమారు 8 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకురావడం జరిగిందని, వాటిని నిర్దేశిత సమయం లోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా తాగునీరు, రహదారి, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## ట్విటర్ ఎక్కితేకానీ కేసు నమోదు కాలేదు

**ఉలవపాడు, ఆగస్టు8, ప్రభాతవార్త:** ట్విటర్‌లో పోస్టు పెడితే కానీ ఉలవపాడు పోలీసులు స్పందించారు. ఒక చోరీ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్లితే ఉలవపాడులోని సుజాత కిరణ్ దంపతుల ఇంట్లో మూడు నెలల క్రితం బంగారం చోరీ జరిగింది. కిరణ్ కెనడాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిర్వహిస్తున్నారు. ఇంట్లో జరిగిన చోరీ కేసుపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు కేసు నమోదు చేయలేదు. దీంతో ఆ యువకుడు ట్విటర్‌లో డీజిపి. జిల్లా ఎస్పీ లను ఉద్దేశించి పోస్టు చేశారు. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు స్థానిక పోలీసులతో మాట్లాడారు. ఆదివారం రాత్రి చోరీ కేసు నమోదు చేశారు.

## రికార్డుల నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలి

**కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :** సాంఘిక సంక్షేమ వసతి గృహ సంక్షేమ అధికారులు విధి నిర్వహణలో అంకిత భావంతో పాటు రికార్డు నిర్వహణ పారదర్శకంగా ఉండాలని ఏఎస్‌డబ్ల్యూ మనోజ్ పేర్కొన్నారు. కోవూరులోని ఏఎస్‌డబ్ల్యూ కార్యాలయంలో సోమవారం కోవూరు, ఇందుకూరుపేట మండలాలకు సంబంధించిన సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయడమే కాకుండా విద్యార్థుల ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆజాదీ కా అమృత్ హోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేది జెండా పండుగను ఘనంగా నిర్వహించేలా సంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి వసతి గృహంలో పరిసరాల పరిశుభ్రతపై కూడా సంక్షేమాధికారి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాకాలం సీజన్ కనుక పిల్లలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రతి సంక్షేమాధికారి వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో రెండు మండలాలకు సంబంధించిన సంక్షేమాధికారులతో పాటు కార్యాలయ పర్యవేక్షకులు దయాకర్ ఉన్నారు.

## మెగా మేళాను విజయవంతం చేయాలి



**కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :** నెల్లూరు లోని దర్గామిట్ట ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేది జరగనున్న వ్యవసాయ శాఖ మెగా మేళాను పూర్తిగా విజయవంతం చేసేలా వ్యవసాయ శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయాధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన మార్పులపై రైతుల్లో అవగాహన పెంచేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ క్రాప్ వేగవంతం చేయడమే కాకుండా సీసీఆర్‌సీ కార్డులు కూడా కౌలు రైతులకు అందించేలా దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. అదేవిధంగా పొలంబడి కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించి రైతుల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానంపై మరింత అవగాహన పెంచేలా చూడాలన్నారు. ఈ సమీక్షలో సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వ్యవసాయాధికారులు ఇందిరావతి, సురేంద్రరెడ్డి, కృష్ణయ్య, శైలజాకుమారి, తదితరులు ఉన్నారు.

## కోవూరు చెరువు కలుజుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



**కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :** కోవూరులోని చెరువు ప్రాంతంలో ఉన్న కలుజుపై బ్రిడ్జి నిర్మించేలా అధికారులు చొరవ తీసుకోవాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం డిప్యూటీ తహసల్దార్ ఇలియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల సీపీఎం కార్యదర్శి శేషయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో కోవూరు కలుజు ఉధృతంగా పారడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రహదారి గుండా నిత్యం గాంధీ జన సంఘం, గుమ్మల దిబ్బ, పాటూరు, యల్లాయపాలెం ప్రాంతాలకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణానికి కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్‌కే చాన్‌బాషా, ఎం. సుబ్బారావు, ఎస్‌కే కరిముల్లా, ఎస్‌కే ఖాలేషా, జి. బుజ్జయ్య, సురేష్, మహ్మద్, తదితరులు ఉన్నారు.

## యనమదలలో నేడు గడపగడపకు మన ప్రభుత్వం

**చేజర్ల, ఆగస్ట్8, ప్రభాతవార్త:** చేజర్ల మండలం యనమదల సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండలాధ్యక్షురాలు బాలిరెడ్డి రమాదేవి పేర్కొన్నారు. ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాయం పరిధిలోని గ్రామాల్లో గడపగడపకు తిరిగి ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాన్ని సేకరిస్తారని ఆమె తెలిపారు. మండలాన్ని నాలుగు టీమ్‌లుగా విభజించి సభ్యులంతా గ్రామాల్లో తిరిగి సమస్యలపై వినతిపత్రాలు సేకరిస్తామన్నారు. శాసనసభ్యులు విక్రమ్‌రెడ్డి కొంతమంది అధికారులతో ఒక టీమ్, ఎంపిపి , మరికొందరు అధికారులతో ఒక టీమ్‌గాను, జడ్పీటిసి సభ్యులు, అధికారులు ఒక టీమ్‌గాను, మండల కన్వీనర్ , అధికారులతో ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలంతా సచివాలయ పరిధిలోని గ్రామాల్లో తిరిగి ప్రభుత్వ పరిపాలనపై వారి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. మండలంలోని వైకాపా కార్యకర్తలు , అధికారులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## ఘనంగా మొహరం వేడుకలు

**చేజర్ల, ఆగస్ట్8, ప్రభాతవార్త:** మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని చిత్తలూరు, తూర్పుకంభంపాడు, పుట్టుపల్లి, పెరుమాళ్ళపాడు, పాడేరు, పాతపాడు గ్రామాలో్ల మొహరం వేడుకలు నిర్వహించారు. పీర్లకు ఉగ్రం ఎక్కించి గ్రామోత్సవం నిర్వహిస్తారు. భక్తులంతా అగ్నిగుండంలో ప్రవేశించి తమ భక్తిని చాటుకుంటారు. హిందూముస్లింలు కులమతాలకు అతీతంగా ఈపండుగను నిర్వహిస్తారు. పీర్లచావిడి వద్ద అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు .

## పేదలకు భోజన ప్యాకెట్లు అందజేసిన మారిశెట్టి భాస్కర్

**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త:** కావలి పట్టణ పాతవూరులో నివసిస్తున్న మారిశెట్టి భాస్కర్ సోమవారం పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. పట్టణంలోని వెంగళరావు, ఓవర్ బ్రిడ్జి, తహశీల్దార్ కార్యాలయం, ఆర్టీసి బస్టాండ్, రైల్వే స్టేషన్, శివాలయం ప్రాంతాలలో వున్న నిరుపేదలకు భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి నెల మొదటి సోమవారం నిరుపేదలకు, యాచకులకు ఆహారం ప్యాకెట్లు అందజేస్తున్నామన్నారు. పేదల ఆకలి తీర్చడంలో ఎంతో సంతోషం వుందన్నారు.

## ఏపిఎస్‌పిడిసిఎల్ చైర్మన్‌ను కలిసిన వైఎస్‌ఆర్ విద్యుత్ సంఘ నాయకులు

**నెల్లూరు ఆగస్టు 8 ప్రభాతవార్త-హరనాథపురం**ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిఎస్‌పిడిసిఎల్) మేనేజింగ్ డైరెక్టర్, చైర్మన్ కె. సంతోష్‌రావును వైఎస్‌ఆర్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ కార్యదర్శి జి.వి. శివయ్య మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందించారు. సోమవారం తిరుపతి రీజనల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్‌ను కలిసిన ఆయన విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

## నీలినాలుక వ్యాధి టీకాలు వేయించాలి

**వలేటివారిపాలెం ఆగస్టు 8, ప్రభాతవార్త:** ప్రస్తుత సీజనులో నీలినాలుకవ్యాధి నివారణ నిమత్తం వలేటివారిపాలెం లింగసముద్రం మండలాలల్లో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధశాఖ సహాయసంచాలకు కె.వి. బ్రహ్మయ్య తెలిపారు. ఈ వ్యాధి సోకడం వలన పశువులకు గలిగే ఇబ్బందులు, రైతులకు ఎదురయ్యేనష్టాలను ఆయన వివరించారు. ప్రతి ఒక్కరూ తమ తమ పశువులకు ఈ టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలి



**కొడవలూరు ఆగష్టు 8 ప్రభాతవార్త:** కాలంలో గర్భంలో కలిసిపోయిన తెలుగు జాతి స్వాతంత్ర సమరయోధులను తలచుకుంటు అజాత్ కా అమృత్ మహోత్సవాలలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలి అని ఎంపిడీఓ సుబ్రహ్మణ్యం కోరారు. కొడవలూరు మండలంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం ఎపిఎం రుక్మిణి విఓఏలతో సమీక్ష సమావేశం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ఎంపిడీఓ సుబ్రహ్మణ్యం హాజరైనారు. ఈ సంద్భంగా అయన మాట్లాడుతూ పొదుకులో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి అజాత్ కా అమృత్ మహోత్సవాలలో భాగంగా ప్రతి ఇంటి పై జాతీయ జెండా ఎగరవేసేలా వారి చెప్పాలని సూచించారు. అంతేకాక కరోనా సంబంధించిన బూస్టర్ వ్యాకీన్ చేసుకొవాలని తెలియజేయమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం రుక్మిణి, ఇసి ఉదయ్ కుమార్, విఓఎలు తదితరులు పాల్గోన్నారు.

## మండల అధ్యక్షురాలుగా ఆంటోనమ్మ

**వలేటివారిపాలెం ఆగస్టు 8, ప్రభాతవార్త:** వలేటివారిపాలెం మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలుగా పోకూరు గ్రామానికి చెందిన గరిజాల ఆంటోనమ్మను నియమించారు. ఈ మేరకు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దివి సౌబాగ్యమ్మ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ నియామకంనకు సహకరించిన దివి సౌబాగ్యమ్మకు ఆంటోనమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

## కెఎస్‌ఆర్ ఫౌండేషన్ చేయూత




**అల్లూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త:** అల్లూరు మండలంలో పనిచేస్తున్న సిబ్బంది అభ్యర్ధన మేరకు సోమవారం కెఎస్‌ఆర్ ఫౌండేషన్ వారు వైద్య పరికరాలు అందజేశారు. కెఎస్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి సహకారంతో 108 సిబ్బందికి పల్స్ ఆక్సిమీటర్, షుగర్, బిపి మిషన్‌ను ట్రస్ట్ సభ్యులు జోసఫ్, మస్తాన్‌రెడ్డి, శ్రీకాంత్‌లు అందజేశారు. ఈ సందర్బంగా 108 సిబ్బంది కాకాణి రవి మాట్లాడుతూ మేము అడిగిన వెంటనే వైద్య పరికరాలు అందించినందుకు ట్రస్ట్ చైర్మన్‌కు, సభ్యులకు కృతజ్ఞతలు తెలియ జేస్తున్నామన్నారు.

## నేటి నుంచి రొట్టెల పండుగ



కిక్కిరిసింది. మొక్కులు తీర్చుకున్న భక్తులు స్వర్ణాల చెరువులో తమ రొట్టెలను విడవగా, కోర్కెలు తీర్చుకునేందుకు భక్తులు ఆరొట్టెలను స్వీకరించడం జరిగింది. దర్గా ప్రాంగణంలో వివిధ ప్రత్యేక తాత్కాలిక దుకాణాలు వెలిసాయి. నెల్లూరు నగర కార్పోరేషన్, పోలీసుశాఖ, నీటిపారుదలశా ఖ, ఆరోగ్యశాఖ, వక్ఫ్ బోర్డు, రెవెన్యూ అధికారులు అన్నీ ఏర్పాట్లను భక్తుల కోసం ఏర్పాటు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయరావులు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లను సిద్ధం చేశారు. దర్గా ప్రాంగణం ప్రత్యేక విద్యుత్ దీపాలకరణాలతో విరాజిల్లుతోంది. మంగళవారం నుంచి భక్తుల తాకిడి ఎక్కువ కానుంది. రెండేళ్ల తరువాత జరుగుతున్న రొట్టెల పండుగ కావడంతో భక్తులు ముందుగానే తరలివచ్చి మొక్కులు తీర్చుకోవడం విశేషంగా కనిపిస్తోంది.









## 14 నుండి బోగోలులో గడపగడపకు మన ప్రభుత్వం

**బిట్రగుంట, ఆగస్టు 8 ప్రభాతవార్త** బోగోలు మండలంలో ఈ నెల 14 నుండి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు ఎంపిడివో నాసరరెడ్డి తెలిపారు. మండలంలో ఫస్ట్‌ఫేజ్ కింద గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముంగమూరు, అల్లిమడుగు, కోవూరుపల్లి గ్రామ సచివాలయాల పరిధిలోని గృహాలను సందర్శించి వారికి అందుతున్న సంక్షేమ పథకాలు గురించి వివరించడం, ఇంకనూ వారికి అర్హత వుండి ఏమైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. కావున ఆయా సచివాలయ పరిధిలోని సచివాలయ సిబ్బంది, మండలంలోని అన్ని శాఖల అధికారులు తగిన నివేదికలు సిద్ధం చేసి వుంచాలని ఆయన ఆదేశించారు.

## ఒటిఎస్‌తో ప్రజలకు ఆస్తి హక్కు



**సంగం ఆగస్టు 8 ప్రభాతవార్త** ఒటిఎస్ అనేది అద్భుతమైన కార్యక్రమం అని వైసిపి నాయకులు వెంగారెడ్డిపాళెం గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వెంగారెడ్డిపాళెం సచివాలయంలో ఒటిఎస్ పట్టాలు పంపిణి చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా జగనన్న ప్రభుత్వం పేదలకు ఇచ్చిన పట్టాలపైన ఆస్తి హక్కు కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన ప్రశంసించారు. ఒటిఎస్ పట్టా ఉంటే ఋణసదుపాయం పొందే అవకాశం కూడా ఉందని అన్నారు. అనంతరం గ్రీవెన్స్‌డే కార్య క్రమాన్ని నిర్వహించి ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. 13 మందికి ఒటిఎస్ పట్టాలు అందజేశారు. అలాగే ఎస్‌టిలకు ఆధార్ కొత్తగా నమోదు చేసే కార్యక్రమాన్ని నిర్వ హించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి లక్ష్మీలావణ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివశంకర్‌రెడ్డి, వాలింటరీలు శెర్వణాబాబు, హేమలత, పవిత్ర, భవ్య, ప్రదీప్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## 10న బోగోలులో గృహ నిర్మాణాలపై మోటివేషన్ కార్యక్రమం

**బిట్రగుంట, ఆగస్టు 8 ప్రభాతవార్త** బోగోలు మేజర్ పంచాయతీలోని 1,2,3 పరిధిలోని లేఅవుట్లలో నిర్మిస్తున్న పక్కా గృహాలు వేగవంతం చేసేందుకు స్వయం సహాయక బృందాలు, లబ్ధిదారులతో మోటివేషన్ కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేది నిర్వహించనున్నట్లు ఎంపిడివో నాసరరెడ్డి తెలిపారు. ఆయా సచివాలయాల పరిధిలో పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులు, పొదుపు స్వయం సహాయక బృందాలు, ఇంజనీరింగ్ సహాయక కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

## ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఏసిబి విచారణ చేయించాలి




**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** కావలి మున్సిపాల్టీ పరిధిలో, నియోజకవర్గంలో యథేచ్ఛగా సాగుతున్న ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఏసిబి సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సిపియం కావలి పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య, సిపిఐ కావలి డివిజన్ కార్యదర్శి డేగా సత్యనారాయణలు మాట్లాడారు. కావలి పట్టణ పరిధిలో అనేక గుంతలు, కాలువలు, ఖాళీస్థలాలు, చెరువుల్ని అధికార పార్టీ అండదండలతో కొంతమంది భూకబ్జాలకు పాల్పడుతూ అక్రమంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తు న్నారన్నారు. మరి కొంతమంది పక్కా బిల్డింగ్ నిర్మిస్తూ కోట్లాది రూపాయల ప్రభుత్వ ప్రజాధనాన్ని కొల్లగొడుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం దుర్మార్గమన్నారు. పేదోడికి సెంటు భూమిని ఐదు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అధికార అండ వున్న వారికి ఎకరాల భూమి పట్టణంలో ఇవ్వడం ఇదేమి న్యాయమని ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. మూడు సంవత్సరాల వైసిపి పాలనలో అధికార పార్టీకి చెందిన కొంతమంది భూకబ్జాలు, అక్రమ మైనింగ్ వ్యాపారం చేస్తూ ప్రభుత్వ ధనానికి కోట్లాది రూపాయలు గండికొట్టారన్నారు. అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారే తప్ప నియంత్రించడం లేదని దుయ్యబట్టారు. కావలి మున్సిపల్ కమిషనర్‌గా శివారెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రియల్ ఎస్టేట్‌లకు, గుంటలకు, చెరువులకు, ఆక్రమణలకు, పెద్దపెద్ద నిర్మాణాలకు అనుమతులు ఇచ్చి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నాడని వారు ఆరోపించారు. అంతేకాకుండా కావలి మున్సిపాల్టీలో అనేక రకాలుగా అవినీతి అక్రమాలకు పాల్పడుతుంటే ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అధికార పార్టీ అండదండలతో ఆయన సంపాదనకు అడ్డుఅదుపు లేకుండా పోతుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పట్టణ పరిధిలో జరుగుతున్న భూ ఆక్రమణలకు, అక్రమ నిర్మాణాలకు, గ్రావెల్ మాఫియాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్న అధికారులపై ఏసిబి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భూకబ్జాదారుల ఆటకట్టించాలన్నారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు చేపట్టకపోతే ప్రజాందోళన చేపడతామని వారు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపియంపార్టీ నాయకులు జి.మధుసూదన్‌రావు, బి.కృష్ణయ్య, వై.కృష్ణమోహన్, పి.పెంచల నరసింహం, సిపిఐ నాయకులు చేవూరు కొండయ్య, బోసు, నరసింహం, డివైఎఫ్ఐ నాయకులు టి.అజయ్‌కుమార్, మోతసాయి, యం.సాయి, చిత్రు, తదితర వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పులికల్లులో అజాదికా అమృత్ మహోత్సవం




**పొదలకూరు ఆగస్టు 8 ప్రభాతవార్త** మండలంలోని పులికల్లు గ్రామంలో ప్రజాపరిషత్ ప్రైమీరి స్కూల్‌లో సోమవారం పంచాయితీ సర్పంచ్ జి.వి సుబ్బమ్మ అధ్యక్షతన ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. రెండోవతేది నుండి 15 వ తేది వరకు తలపెట్టిన ఆజాదికా అమృత్ మహోత్సవంలో 6 వరోజు గ్రామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా శానిటేషన్‌పై ర్యాలీ నిర్వహించారు. ముందుగా పిల్లలో దేశభక్తిని నింపి స్వతంత్ర దినోత్సవ సాధనలో సమిధులైన సమరయోధులకు నివాళులర్పించారు. పంచాయితీ కార్యదర్శి మాధవి మాట్లాడుతు విద్యార్థులకు స్వతంత్ర పోరాట పఠమ గురించి వివరించారు. అనంతరం అడుగడుగున ప్రతి ఇంటిలోను పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. తదుపరి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భారత్‌మాతకి జై అనే నినాదాలతో ర్యాలీ కొనసాగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ నాయకులు నారాయణరెడ్డి, పెంచలరెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వాలింటరీలు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పారు 2 సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు వ్వినాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా చెన్నైకు చెందిన బైన మురళీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బి. సురేష్, ధర్మకర్తలు పి. మోహన్, ఏ. హనుమారెడ్డి, సీహెచ్ సుధాకర్, భక్తులు ఉన్నారు.

## సరోజనమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన 'మాలేపాటి'



**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట రమేష్ తల్లి సరోజనమ్మ చిత్రపటానికి టిడిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. సోమవారం జరిగిన ఉత్తరక్రియలలో భాగంగా మాలేపాటి కోట రమేష్ నివాసానికి వెళ్లారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. సరోజనమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. మాలేపాటి వెంట టిడిపి సీనియర్ నేత బొట్లగుంట శ్రీహరినాయుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి తటవర్తి వాసు, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ మస్తాన్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఇనాయిత్ హుస్సేన్, టిడిపి నేతలు పోతుగంటి శ్రీకాంత్, చవల మురళీకృష్ణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## మాపాఠశాలను విలీనం చేయవద్దు...జమ్మలపాళెం వాసులు

**జలదంకి, ఆగస్టు8, ప్రభాతవార్త:** చిన్న పిల్లలు రోడ్ దాటాలంటే ప్రమాదం పొంచివుంది దయచేచి పాఠశాలను విలీనం చేయొద్దంటూ అదికారులను వేడుకుంటున్నారు జలదంకి మండలం జమ్మలపాళెం మిక్స్‌డ్ కాలనీ వాసులు .సోమవారం వారు తహసిల్‌దార్ కార్యాలయానికి చేరుకొని ఈమేరకు విజ్ఞప్తిచేశా రు. డిప్యూటీ తహసిల్‌దార్ భరత్‌కు వినతిపత్రం అందజేశారు..కాలనీలో ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనారిటీ కుటుం బల పిల్లలు విద్యనభ్యసిస్తున్నారన్నారు. అయితే నిద్రలేచి కూలీ, నాలీ చేసుకొని బ్రతికే తాము పనులు మాని బిడ్డల్ని దగ్గరుండి రోడ్ దాటించి బడిలో వదలి వెళ్ళాలంటే అది వీలయ్యేపనికాదని విన్నవించారు. చిన్నారులను వంటరిగా పంచించాలంటే కె.యు రోడ్ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు జరుగుతూ ప్రమాదాలు పొంచి వుంటాయని అన్నారు. ఈస్తితిలో వారిని ప్రదానగ్రామంలలో వుండే యు.పి పాఠశాలకు పంపడమంటే ప్రమాదం కోరితెచ్చుకున్నట్లేనని స్పష్టంచేశారు. కావున మాఇబ్బందులను గుర్తెరిగి విలీన ప్రక్రియను విరమించుకోవాలని కోరారు. డి.టి.ని కలసినవారిలో సి.పి.ఎం జిల్లా నేత తాళ్ళూరు. మాల్యాద్రి, డి.వై.ఎఫ్.ఐ నేత అడపాల.సురేష్, కాలనీవాసులు ఎస్.కె.మస్తాన్, ఆర్.పొట్టి.శ్రీరాములు, ఎస్.కె ఇస్మాయిల్ తదితరులు వున్నారు.

## కమ్మవారిపాళెంలో తల్లిపాల వారోత్సవాలు

**జలదంకి, ఆగస్టు8.ప్రభాతవార్త:** జలదంకి మండలం కమ్మవారిపాళెం ఎస్.సి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్బంగా ముర్రువాల విశిష్టతను గూర్చి టీచర్లు వివరించారు. ప్రతి బాలింత బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాల్సిన అవసరం ఎంతైనావుందని తెలియజేశారు. చనుబాలు శిశువులకు సంజీవనిలా పనిచేస్తాయనిచెప్పారు. అంతే కాకుండా బిడ్డ ఎదుగుదలకు దోహదపడడమే కాకుండా రోగనిరోదక శక్తి పెరిగి పరిపుష్టిగా తయారవుతారని వివరించారు. భవిషత్‌లో చురుకుదనంతో వుండడమే కాకుండా మెదడు పనితీరులో చురుకుదనం వస్తుందని సూసించారు. కావున ప్రతి తల్లి ఈవిషయాలను దృష్టిలో పెట్టుకొని ఆచరిస్తే పిల్లలకు అన్నివిధాలా మంచిదని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహణాసెంటర్ కార్యకర్త కవిత, మైన్ సెంటర్ టీచర్ జ్యోతి, చామదల అంగన్‌వాడీ టీచర్లువసంత, విజయ, కళ్యాణి, ఆశాకార్యకర్త పి.లక్ష్మీకాంతమ్మ, పలవురు తల్లులు గర్బవతులు చిన్నారులు పాల్గొ న్నారు.

## త్యాగధనుల స్ఫూర్తితో దేశభక్తిని పెంపొందించుకోండి



**జలదంకి, ఆగస్టు8, ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర్య కోసం పోరాడి అసువులు బాసిన త్యాగధనులను స్ఫూర్తిగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకోవాలని లోక్‌సత్తా ఉద్యమసంస్త రాష్ట్ర సమన్వయకమిటీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి పిలువు నిచ్చారు. క్విట్‌ఇండియా ఉద్యమం 80 వ సంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జలదంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఓకార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిదిగా విచ్చేసిన ముదిగండ్ల తనదైన శైలిలో ఉద్యమంగూర్చి సోదాహరణంగా వివరించి విద్యార్థినీ, విద్యార్థులను ఉత్తేజపరచారు. మహాత్మాగాంధీ పిలుపుమేరకు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేఖంగా చేపట్టిన సహాయనిరాకరణ ఉద్యమం అప్పట్లో ఇంగ్లీషువారి వెన్నులో వణుకు పుట్టించిందన్నారు. అవగాహనా సదస్సుకు అద్యక్షత వహించిన ఇన్‌చార్జ్ ప్రధానోపాద్యాయుడు మాల్యాద్రి మాట్లాడుతూ ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా అనాటి ఉద్యమాలలో పాలు పంచుకున్న సమరయోధులైన తిప్పారెడ్డి. యల్లమందారెడ్డి వంటేరు. వరదారెడ్డి, కూనం .నర్సా రెడ్డి, కాసు. కొండపనాయుడులను గూర్చి వివరించారు. వారు జైలు జీవితాలు అనుభవించి దేశానికిస్వేశ్చా స్వాతంత్ర్యాలు సాధించిపెట్టారని తెలిపారు. కార్యక్రమంలో విద్యాకమిటి చైర్మన్ దగ్గుమాటి. శ్రీకాంత్‌రెడ్డి, ఉపాద్యాయినీ, ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చెరువులన్నింటికి బహిరంగ వేలంపాట నిర్వహించండి



**జలదంకి, ఆగస్టు8, ప్రభాతవార్త:** జలదంకి పంచాయతీపరిధిలోని చెరువులన్నింటికి బహిరంగ వేలంపాట నిర్వహించాలని భారతీయ యువ మోర్చా రాష్ట్ర సోషల్‌మీడియా కోకన్వీనర్ వడ్డేశ్రీ నాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఎం.పి.డి.ఒ ఆదినారాయణను స్తానిక కార్యాలయంలో కలసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది బహిరంగ వేలం చేపట్టకుండా కొంత మంది అధికార పార్టీ నేతలు లోపాయకారీ ఒప్పందాలతో చేజిక్కించుకున్న వైనాన్ని ఎం.పి.డి.ఒ దృష్టికి తీసుకువచ్చారు. దీనివ్ల పంచాయతీకి ఎంత సష్టం వాటిల్లిందో కూడాతెలియజేశారు. ఈసారి అలా జరగడానికి వీలులేదని అవసరమైతే వందమంది గ్రామస్తులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దర్నా చేపడతామని స్పష్టంచేశారు. వెంటనే నూతన నోటిఫికేషన్‌విడుదలచేసి ఎటువంటి అవకతవకలు జరగకుండా వేలం జరపాలని అన్నారు. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని కోరారు. దీనిపై గత ఫిబ్రవరిలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన వైనాన్ని కూడా గుర్తుచేశారు. అలాగే గ్రామంలో నెలకొనివున్న పలు సమస్యలనుగూర్చి కూడా శ్రీనాద్‌రెడ్డి వివరించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మండల బారతీయ జనతా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు ముడి.కిషోర్‌రెడ్డి, యువమోర్చా ఉపాధ్యక్షులు కమతం.బాలకోటయ్య యాదవ్‌లు వున్నారు.

## వైభవంగా పీర్లకు పూజలు



**కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త :** కోవూరులోని పీర్ల చావిడిలో మోహర్రం పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసి ఉన్న పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సయ్యద్ మగ్దూమ్ మొహిద్దీన్ పీర్ల యొక్క విశిష్టతను ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా చావిడిలో ఏర్పాటు చేసి ఉన్న పీర్లకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ముస్లిం పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బోగోలులో మొహరం సందడి

**బిట్రగుంట, ఆగస్టు 8 ప్రభాతవార్త** మండల కేంద్రమైన బోగోలు, ఇబ్రహీంపేటతో పాటు పలు గ్రామాలలో త్యాగాలకు ప్రతీకగా పీర్ల చావడి వద్ద నిర్వహించుకునే మొహరం కార్యక్రమాల్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గత మూడు రోజుల నుండి ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 9వ తేది జరిగే మొహరంతో ముగియనున్నాయి. పీర్ల చావిడిని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

## మాదిగల ప్రధాన శత్రువు బిజెపి



**వింజమూరు, ఆగస్ట్8, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణకు మాట ఇచ్చి మాట తప్పిన బిజెపి మాదిగల ప్రధాన శత్రువని ఎంఎస్‌పి నాయకులు పేముల మాల్యాద్రి మాదిగ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన దీక్షలు 7వ రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా పలువురు ఎంఎస్‌పి, ఎమ్మార్పీఎస్ నాయకులు , నియోజకవర్గస్థాయి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మారీ ్పఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అలుపెరుగని చేసిన పోరాటాలతో ఆనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణకు సుముఖత వ్యక్తం చేసి మళ్ళీ మాట తప్పి వర్గీకరణ అంశాన్ని అటకెక్కించిందన్నారు. తమ పోరాటం అంతిమలక్ష్యం వర్గీకరణ సాధనేనన్నారు. మాదిగలను అడుగడుగునా మోసం చేస్తున్న పార్టీ బిజెపియేనన్నారు. ఎంఎస్‌పి జిల్లా నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ, స్వర్ణ కొండయ్య, కూనిపోగు ఈర్మియ, బొర్రా వెంగళరావ్, రొడ్డా బాబు, గంగపట్ల రవీంద్ర, జ్ఞాన కుమార్, కేశవరావ్, మాల్యాద్రి, గంగపట్ల హరికృష్ణ , నాగరాజు, చంద్రయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



**సైదాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలపై రైతులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి హైమావతి తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలతలుపూరు, దేవరవేమూరు, కలిచేడు గ్రామ పంచాయతీల్లోని రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం రైతులు వేసిన వరినాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక రకాల పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే తప్పనిసరిగా ఈకేవైసి చేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఆమె వెంట రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

## నాడు-నేడు పేస్-2పై ప్రత్యేక సమావేశం



**బుచ్చి ఆగస్టు8 ప్రభాతవార్త** నాడు-నేడు పేస్-2పైన బుచ్చిరెడ్డిపాళెం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ నరసింహరావు, ఎంఇఒ దిలీప్‌కుమార్ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈకార క్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతు నాడు- నేడు ఎస్టిమేషన్లన్ని మంగళవారంసాయింత్రానికల్లా పూర్తి చేయాలని సూచించారు. సెకండ్ పేస్‌లో నాడు- నేడు కింద 40 పాఠశాలలు, అంగన్‌వాడీసెంటర్‌లు మంజూరు అయినట్లు తెలిపారు. ఎఇ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తపాలా కార్యాలయంలో జాతీయ జెండాల అమ్మకాలు



**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** ఆజాదికా అమృత మహోత్సవంలో భాగంగా అన్ని తపాలా శాఖ కార్యాలయాలలో జాతీయ పతకాలు సిద్ధంగా వున్నాయని కావలి హెడ్ పోస్ట్‌మాస్టర్ ఎ.వి.కృష్ణయ్య తెలిపారు. సోమవారం తపాలా కార్యాలయంలో జాతీయ పతాకాన్ని చూపిస్తూ మాట్లాడారు. ఒక్కో జాతీయ పతాకంను 25 రూపాయలకు అమ్ముతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ జాతీయ పతాకాన్ని తపాలా కార్యాలయంలో గానీ వెబ్‌సైట్‌లో కానీ కొనుగోలు చేయవచ్చునని ఆయన తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 వసంతాలైన సందర్భంగా దేశవ్యాప్తంగా ఈ ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరు వారి ఇళ్ళపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ యం.జి.కె.సాయి పాల్గొన్నారు.

## మున్సిపల్ వర్కర్ల జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి




**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రెండవ నెల్లూరు జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మల్లి వెంకయ్య తెలిపారు. కావలి పట్టణ రైల్వే రోడ్డులోని జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాడుతున్నామన్నారు. సమస్యల పరిష్కారానికి పాటు పడుతున్నామన్నారు. ఈ నెల 14వ తేది కందుకూరు పట్టణంలోని కోటారెడ్డి భవనంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రెండవ నెల్లూరు జిల్లా మహాసభలు జరుగుతాయన్నారు. ఈ సభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. చాలిచాలని జీతాలతో పనిచేస్తున్న అర్హులైన వారి పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం తొలగించడం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై త్వరలో ఉద్యమం చేపడతామని హెచ్చరికలు చేశారు. ఈ సమావేశంలో కావలి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎండ్లూరి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి జి.కిషోర్, కార్యదర్శి ప్రభావతి తదితరులు పాల్గొని మాట్లాడారు.

## అభివృద్దిని అడ్డుకోవడం టిడిపి విధానం కాదు



**విడవలూరు ఆగస్టు 8 ప్రభాతవార్త** అభివృద్ధిని అడ్డుకోవడం తమ విధానం కాదని తెలుగుదేశం నాయకులు విలేఖర్ల సమావేశంలో అన్నారు. టిడిపి రైతు సంఘం నాయకులు దూది విజయ్ రాఘవన్ మాట్లాడుతు దంపూరు గ్రామంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టిడిపి నాయకులు అబివృద్దిని అడుకుంటున్నారని అనడం దారుణమని ఆయన ఖండించారు. వైసిపి మూడు సంవత్సరాల పాలనలో దంపూరులో ఏమి అభివృద్ధి చేస్తుంటే టిడిపి నేతలు అడ్డుకున్నారో తెలపాలనివారు కోరారు. తెలుగుదేశం హయాంలో ముపై ఐదు లక్షల రూపాయాలతో వాటర్ ట్యాంకు నేర్మించి ఎన్నికల కోడు కారణంగా పైప్‌లైను వర్క ఆగిపోవడంతో వాటర్ ట్యాంకు ప్రారంభించలేకపోయామని స్పష్టం చేశారు. పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చేసిన అభివృద్ధికి నేడు పైప్‌లైన్ వర్క పనులు చేసి వైసిపి నాయకులు ప్రారంభోత్సవం చేస్తున్నారని విమర్శించారు. స్దానిక టిడిపి నాయకులు భార్గవ్, రమేష్, మోహన్, వెంకటేశ్వర్లు, హరిబాబు, భాస్కర్ పాల్గోన్నారు.

## జగనన్న పాలనలో టిడిపి నేతలు కూడా లబ్ధిపొందారు



**కావలి రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలనలో పార్టీలకు అతీతంగా అందిస్తున్న సంక్షేమ పథకాలతో టిడిపి నాయకులు, కార్యకర్తలు కూడా లబ్ధిపొందారని కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి రూరల్ మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. సమస్యలు ఏమైనా వున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామంలో అందరి ఇళ్లతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్ళకు కూడా వెళ్ళడం జరిగిందని సంక్షేమ పథకాల పట్ల వారు కూడా సంతృప్తి వ్యక్తం చేయడం జరిగిందన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిలో అత్యవసరమైన పనులు గుర్తించి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిలో ఏదో ఒక రూపంలో జగనన్న సంక్షేమ పథకాలు పొంది ఎంతో సంతోషంగా వున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కులం, మతం, రాజకీయం, ఏ పార్టీ అని కూడా చూడకుండా అందరి ఇళ్ళకు వెళ్లి వారికి సంక్షేమ పథకాలు కానీ, సమస్యలు గానీ అడిగి తెలుసుకుంటున్నా మన్నారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ అవినీతి ప్రభుత్వమన్నారు. నీరు-చెట్టు తదితర అన్ని అవినీతిమయమన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేదల ప్రభుత్వమన్నారు. అవినీతి రహిత ప్రభుత్వమని తెలిపారు. ఎన్నికలకు ఇంకా రెండు సంవత్సరాలు వున్నా ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల స్థితిగతులు తెలుసు కుంటున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 2 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్‌రెడ్డి మంజూరు చేశారన్నారు. ఈ నిధులు ఎక్కడ అవసరమో అక్కడే ఖర్చు పెట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తొలుత ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సర్పంచ్ చిమ్మిలి శ్రీహరినాయుడు ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలికారు.మహిళలు అడుగడుగునా హారతులు పట్టి అభిమానం చాటారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు జంపాని రాఘవులు, వైసిపి నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి కామయ్య, సన్నిబోయిన ప్రసాద్, చిమ్మిలి అంకబాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కోవూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త : జిల్లా పశుగణాభివృద్ధి సంఘం పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో లేగదూడలకు సంబంధించి పోటీలు నిర్వహించడమే కాకుండా వాటి ఎదుగుదలకు కావాల్సిన మినరల్ మిక్చర్ ద్రావణాన్ని ఉచితంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఎల్‌డీఏ చైర్మన్ విజయ్‌కుమార్ అన్నారు. కోవూరులోని డీఎల్‌డీఏ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ లేగదూడల ప్రదర్శనను మంగళవారం ఏఎస్‌పేట మండలం తిమ్మనాయుడు పల్లి గ్రామంలోనూ, ఈ నెల 10వ తేది కలిగిరి మండలం కావలి ముక్తాపురం గ్రామంలోనూ , ఈనెల 11వ తేది కావలి తాళ్లపాలెం గ్రామంలో నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఈ ప్రదర్శనలో కృత్రిమ గర్భధారణపై పాడిరైతుల్లో అవగాహన పెంచడం, లేగదూడల ప్రదర్శన వాటి ఎదుగుదలకు కావాల్సిన అన్ని మందులను డీఎల్‌డీఏ ద్వారా అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా జిల్లాలో పాల ఉత్పత్తిని ఘననీయంగా పెంచేలా చర్యలు తీసుకోవడమే ఈ ప్రదర్శన యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. మేలు జాతి పశు ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి కూడా సారించడం జరిగిందన్నారు. డీఎల్‌డీఏ కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ సోమయ్య మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండలంలోని గ్రామంలో ఈ కార్య క్రమానిలు నిర్వహించేలా ప్రణాళికలు కూడా రూపొందించడంజరిగిందన్నారు. పాడిరైతులు ఈ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో సద్విని యోగం చేసుకోవాలన్నారు. డీఎల్‌డీఏ డైరెక్టర్ మల్లికార్జున్‌రావు, పశువైద్యుడు డాక్టర్ నరేష్‌లు ఉన్నారు.




## పెన్షన్లలో కోతకు నిరసనగా టీడీపీ ప్రదర్శన

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** నూతన నిబంధనలు-మార్గదర్శకాల పేరుతోఅసలైన అర్హుల పెన్షన్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టింది. నెల్లూరు మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్, టీడీపీ సీనియర్ నేత తాళ్లపాక అనూరాధ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో మహిళలు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. బాధితులతో కలిసి స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన టీడీపీ ప్రతినిధులు పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన తాళ్లపాక అనూరాధ కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడుతూ నూతన నిబంధనలు-మార్గదర్శకాల పేరుతో వైసీపీ ప్రభుత్వం ఎన్నో సంవత్సరాలుగా పెన్షన్లు అందుకుంటున్న లబ్ధిదారుల పెన్షన్లను తొలగించడం దారుణమన్నారు. రూ. 35 రూపాయలతో మొదలైన ఫించన్ మొత్తాన్ని రూ. 2 వేల రూపాయలకు పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్న ఆమె ప్రస్తుత సీఎం అందుకు భిన్నంగా నిరుపేదలకు వస్తున్న ఫించన్‌లను నిలిపివేస్తున్నారన్నారు. కరెంట్‌బిల్లును సాకుగా చూపి ఒంటరిమహిళలకు ఇచ్చే ఫించన్‌ను నిలిపివేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్న ఆమె యధావిధిగా అటువంటి వారందరికీ పెన్షన్లు అందజేయాలన్నారు. కాగా ఈ కార్యక్రమంలో పార్టీ నేతలయిన పమిడి రవికుమార్‌చౌదరి, అంగని బాలకృష్ణ చౌదరి,రాజా,నారాయణ, కళ్యాణ్, ప్రభాకర్, వనజ, భూలక్ష్మి, శ్రీదేవి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



## కులమతాలకు అతీతంగా సంక్షేమపథకాలు : ప్రసన్న

**విడవలూరు ఆగస్టు 8 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా సంక్షేమపథకాలు అమలు చేస్తున్నారని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రామచంద్రాపురం,కొత్తూరు ,పాతూరు గ్రామాలలో గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతు గడపగడపకు కార్యక్రమానికి ప్రజలు విశేష ఆదరణ చూపుతున్నారని అన్నారు.భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సంక్షేమపథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. సునామీ ఉచ్చిన సమయంలో మత్యకారులకు 1750 కోట్లు దివంగతనేత రాజశేఖర్‌రెడ్డి హయాంలో మంజూరు చేయడం జరిగిందని చెప్పారు.మత్యకారులు వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిందితే 10 లక్షల రూపాయాలు ఇచ్చే విధంగా తమ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.కొత్తూరు గ్రామంలో సిసిరోడ్లు వేయిస్తామని ఎమ్మెల్యే హామి ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఒక్కర్ని ఆప్యాయతగా పలకరిస్తు గడగడపకు కార ్యక్రమాన్ని సాగించారు.ఈకార ్యక్రమంలో తహసిల్దారు చంద్రశేఖర్, సిఐ కోటేశ్వరరావు,వైసిపి నాయకులు ఆప్కాబ్ చైర్మన్ కోండూరు అనీల్‌బాబు, మాజీ ఎంపిసి

## కలెక్టరేట్ వద్ద కదం తొక్కిన కండలేరు మత్స్యకారులు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** చేపల మాఫియాతో చేతులు కలిపి దాచూరు మత్స్యకార సహకార సొసైటీ (కండలేరు) పాలకవర్గాన్ని ఇబ్బందుకు గురిచేస్తున్న రాపూరు మండలాధ్యక్షులు చెన్ను బాలకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని..రాపూరు, పొదలకూరు,చేజర్ల, కలువాయి మండలాలకు చెందిన 15 వేల మత్స్యకార కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా మండలాలకు చెందిన మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీ పెంచలయ్య తదితరులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగు మండలాల్లోని 25 గ్రామాలకు చెందిన 15 వేల మత్స్యకార కుటుంబాలు కండలేరు జలాశయంపై ఆదారపడి జీవిస్తుంటే చేపలమాఫియాతో చేతులు కలిపిన రాపూరు ఎంపీపీ వారిని బెదిరిస్తుండడం, మత్స్యశాఖ అధికారులను లోబరుచుకొని నిజమైన సొసైటీ సభ్యులనున చేపలు పట్టుకోనీయకుండా అడ్డుకుంటుండడం దారుణమన్నారు. కండలేరు జలాశయంలో చేపలు పట్టుకొనే హక్కు కలిగిన దాచూరు మత్స్యకార సొసైటీ ఏర్పడి మూడున్నర సంవత్సరం కాగా సొసైటీ పదవీకాలం మరో ఏడాదిన్నర వుండగా రాపూరు ఎంపిపి సొసైటీ అధ్యక్షులు, డైరక్టర్లను బెదిరిస్తుండడం, సొసైటీ రికార్డులు తనకు అప్పగించాలని బెదిరిస్తుండడం దారుణమన్నారు. అధికారబలాన్ని ఉపయోగించుకొని సొసైటీ సభ్యులను రిజర్వాయర్‌లో చేపలు పట్టుకోనీయకుండా అడ్డుకుంటూ చేపల మాఫియాకు సహకరిస్తున్న రాపూరు ఎంపీపీపై చర్యలు తీసుకోవాల ని.. .గిరిజన యానాది మత్స్యకారులను ఆదుకోవాలని వారు ఈసందర్భంగా డిమాండ్ చేశారు. చేపల మాఫియాతో కుమ్మక్కై యానాదుల పొట్ట కొట్టాలని చూస్తే ఊరుకొనేది లేదన్న వారు జిల్లా అధికారులు తక్షణమే స్పందించి వారిని ఆదుకోవాలని లేకపోతే ఈ విషయంపై జాతీయ ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అదేవిధంగా కండలేరు జలాశయ పరిధిలోని పేద గిరిజన మత్స్యకారుల పొట్టకొట్టేందుకు ప్రయత్నిస్తే వచ్చే ఎన్నికల్లో అటువంటివారిని చిత్తుగా ఓడిస్తామన్నారు. ఈ మేరకు నినాదాలు చేసిన మత్స్యకారులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డికి అందజేశారు.

## 10న చెముడుగుంటలో మెగామెళా

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** డాక్టర్ వైఎస్ఆర్ వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా సంఘాలుగా ఏర్పడ్డ రైతులకు జిల్లాలో ట్రాక్టర్లను పంపిణీ చేసే కార్యక్రమం బుధవారం జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి గుంటూరులో ప్రారంభించగా ఆత్మకూరు ఉప ఎన్నికల కారణంగా జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో వుండడంతో ఆ కార్యక్రమంలో నెల్లూరుజిల్లాన చేర్చలేదు. తాజాగా జిల్లాకు సంబంధించి బుధవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమవుతోంది. వెంకటాచలం మండలంలోని చెముడుగుంటలో ఈ మెగామేళాను నిర్వహిం చనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాకు వివిధ కంపెనీలకు చెందిన 223 ట్రాక్టర్లు రావడం గమనార్హం. వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొనే ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు-అధికారులు హాజరుకానున్నారు.

## కలెక్టర్‌ను కలిసిన నెల్లూరు నూతన ఆర్‌డిఓ




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** నెల్లూరు ఆర్‌డిఓగా నియమితులయిన మలోలా సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా నెల్లూరు ఆర్‌డిఓగా పనిచేస్తున్న కొండయ్యను అన్నమ య్య జిల్లా డిఆర్వోగా బదిలీ చేసిన ప్రభుత్వం సెలవులో వున్న మలోలాను నెల్లూరు ఆర్‌డిఓగా నియమించిన విషయం విదితమే.

## కుళాయి పన్ను,హౌసింగ్,శానిటేషన్‌పై సమీక్ష



**బుచ్చి ఆగస్టు 8 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలో మున్సిఫల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకుళాయిపన్ను,హౌసింగ్,శానిటేషన్‌పై సమీక్ష నిర్వహించారు.స్పందన కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి అర్జీలు సీ ్వకరించారు.ఈకార్యక్రమంలో కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి,వైస్ చైర్మన్ షేక్ షాహుల్,కౌన్సిలర్లు రాచూరు సత్యనారాయణ, పుట్టా లక్ష్మీకాంతమ్మ, వైష్ణవి ,సిబ్బంది పాల్గొన్నారు.

## తీర ప్రాంత విద్యార్థులకు ఆర్టీసి బస్సుని ప్రారంభించిన ఎమ్మెల్యే



**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** కావలి తీర ప్రాంతాల్లోని విద్యార్థుల రాకపోకల కోసం నూతనంగా ఆర్టీసి బస్సు సర్వీసులు చేపట్టినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం కావలి ఎమ్మెల్యే నివాసం వద్ద ఆర్టీసి బస్సు కొత్త సర్వీసుని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. బస్సుకు పచ్చ జెండా ఊపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కావలి రూరల్ మండలంలో తాను గడపగడప కార్యక్రమాన్ని చేపట్టిన సమయంలో తీర ప్రాంతాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆర్టీసి బస్సు సర్వీసు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. తీర ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు ఆర్టీసి అధికారులతో మాట్లాడటం జరిగిందన్నారు. కొత్తగా ఆర్టీసి డిపో మేనేజర్ శ్రీనివాస్‌తో ఈ సమస్యపై చర్చించడం జరిగిందన్నారు. మండలంలో తీర ప్రాంతాలైన తుమ్మలపెంట, పెదపట్టపుపాళెం, కొత్తసత్రం, ఒట్టూరు, చెన్నాయపాళెం గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఈ ఆర్టీసి బస్సు సర్వీసు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని ఈ ఆర్టీసి సర్వీసుని ప్రారంభించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేశారన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల అభివృద్ధిని చేపట్టి విద్యార్థులకు వసతులు కల్పించడం జరిగిందన్నారు. అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈ బస్సును ప్రారంభించడం ఎంతో సంతోషంగా వుందన్నారు. అంతేకాకుండా సిరిపురం, చలంచర్ల, పెద్దవరం గ్రామాల ప్రజల రాకపోకలకు కూడా త్వరలో ఆర్టీసి బస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఆర్టీసి డిపో మేనేజర్ శ్రీనివాస్, వైసిపి నేతలు కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి కామయ్య, సన్నిబోయిన ప్రసాద్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ స్పందనకు వినతుల వెల్లువ



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు నేతృత్వంలో సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువలా వచ్చాయి. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు వ్యక్తిగత సమస్యలు పరిష్కరించాలని..సామూహిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్ కేవీఎన్‌చక్రధర్‌బాబు, జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, డిఆర్వో వెంకటనారాయణమ్మలు ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. కాగా ఈ కార్యక్రమంలో టీజీపీ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి, జిల్లాపరిషత్ సీఈఓ వాణి, డిపిఓ ధనలక్ష్మి, మెప్మా పీడీ తిరుపతయ్య, డిఆర్‌డిఏ పీడీ కేవీసాంబశివారెడ్డి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, సర్వే-ల్యాండ్‌రికార్డ్సు ఏడి హనుమాన్‌ప్రసాద్, డీటీసీ చందర్, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడి నాగరాజకుమారి, సమగ్రశిక్ష ఏపీడీ ఉషారాణి, డీసీఓ తిరుపాల్‌రెడ్డి, సెట్నెల్ సీఈఓ పులన్లయ్య,జలవనరులశాఖ ఎస్ఈ కృష్ణమోహన్, బీసీ కార్పోరేషన్ ఈడీ బ్రహ్మోనందరెడ్డి, డిఎస్‌డబ్ల్యుఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ వర్కర్‌ను నియమించాలంటూ వినతి** కలువాయి మండలం దాసరపల్లిలో అంగన్‌వాడీకేంద్రానికి అంగన్‌వాడీ వర్కర్‌ను నియమించాలని కోరుతూ ఆ గ్రామస్థులు స్పందనకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్ ఉద్యోగవిరమణ చేసిందన్న వారు ఆ స్థానంలో మరొకరిని నియమించాలని ఆ వినతిపత్రంలో కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

**అర్హులందరికీ వాహనమిత్ర వర్తింపుకై వినతి** అర్హులందరికీ వాహనమిత్ర పథకం వర్తింపజేయాలని కోరుతూ జిల్లా ఆటో కార్మిక సంఘ ప్రతినిధులు స్పందనకు వినతిపత్రం అందజేశారు. ఏపీ ఆటో ఎండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టర్‌ను కలిసిన వారు వాహనమిత్రలో ఎదురవుతున్న సమస్యలు-నిబంధనలను సవరించాలని అర్హులైన వారందరికీ వాహనమిత్ర వర్తింపజేయాలన్నారు.

**చేపలు పట్టుకొనేందుకు లీజుకు ఇవ్వవద్దంటూ వినతి** కలువాయి మండలం కలువాయి చెరువు లోతట్టు ప్రాంతాలలో ముంపునకు గురయ్యే రైతుల పట్టాపొలాలు..బావుల్లో చేపలు పట్టుకొనేందుకు మత్స్యకార సొసైటీలకు,,ఇతరులకు లీజుకు ఇవ్వవద్దని కోరుతూ మండలంలోని రామన్నగారిపల్లి, మాదన్నగారిపల్లి, సీతారాంపల్లి, చింతలపాలెం గ్రామాల ప్రజలు స్పందనకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలకు చెందిన 540 ఎకరాలు కలువాయి చెరువు కారణంగా ముంపునకు గురయ్యాయని పేర్కొన్న వారు ఆ భూములకు సంబంధించి నేటికీ తమకు పరిహారం అందలేదన్నారు. ఇందుకోసం న్యాయపోరాటం చేస్తు న్నామన్న వారు ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాలలో చేపలు పట్టుకొనేందుకు సొసైటీలకుగానీ..ఇతరులకుగానీ లీజుకు ఇవ్వవద్దని ఆయా గ్రామాల ప్రజలు ఆ వినతిపత్రంలో కలెక్టర్‌ను కోరారు.

## మెయిన్స్ సెషన్-2 ఫలితాలలో టాపర్స్‌గా విశ్వసాయి విద్యార్థులు




**నెల్లూరు ఆగస్టు 8 ప్రభాతవార్త-విద్య** సోమవారం కేంద్రప్రభుత్వం ప్రకటించిన జెయియి మెయిన్స్ సెషన్-2 పరిక్షా ఫలితాలలో నగరానికి చెందిన విశ్వసాయి కళాశాల విద్యార్దులు టాపర్స్‌గా నిలిచారు. కళాశాలకు చెందిన 102మంది విద్యార్దులు జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఈసందర్బంగా చైర్మన్ డా.సత్య న్నారాయణ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్దులు సిహెచ్ కృష్ణ భరద్వాజ జాతీయ స్థాయిలో 608వ ర్యాంకును సాధించడం గర్వకారణమన్నారు. అలాగే హేమంత్ కుమార్‌రెడ్డి 1564వ ర్యాంకును కైవసం చేసుకున్నారని వివరించారు. అడ్వాన్స్‌డ్ పరిక్షల్లో మరింత ప్రతిభను చాటనున్నారని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విద్యార్దులకు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్, అద్యాపకులు, విద్యార్దులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కావలి శివాలయంలో నాదనీరాజనం



**కావలి, ఆగస్టు 8 ప్రభాతవార్త** నెల్లూరు వీణాత్రయం బృందంలోని శ్రీకంఠం నాగలక్ష్మి సోమవారం కావలి శివాలయంలో నాదనీరాజనం చేసి భక్తుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు. తిరుమల తిరుపతి, శ్రీశైలం, అరుణాచలం, కాళహస్తి, తదితర ప్రాంతాలలో నెల్లూరు వీణత్రయం ఎన్నో కచ్చేరిలు చేసి ప్రశంసలు అందుకున్నారు. ఈ ముగ్గురు మహిళలలో ఒకరైన శ్రీకంఠం నాగలక్ష్మి కావలి శివాలయంలో శివపార్వతులకు ఆమె నాదనీరాజనంచేశారు.కావలి శివాలయం అనువంశిక అర్చకులుఎ.ఆర్.శశిధర్ గురుకుల్, అర్చకులు, భక్తులు ఆమెను ప్రశంసించారు. సత్కరించారు.





## రొట్టెలపండగ ఏర్పాట్లపై సమీక్ష